# లా మిక్సెడ్

"గమ్‌షెడ్‌పూర్" అనే ఒక పట్నం, కొండమీది వూటీలాగు, ఒక ఎత్తైన దిబ్బమీద నిర్మింపబడ్డది. అది ఇంటర్నేషనల్ సెంటరు జినీవాకంటె ఎక్కువ చౌచౌ. ఏమా అంటే జినీవా నుంచి కనవచ్చే చిత్రాల్లో ప్రతీవ్యక్తికీ ఏదో ఒక రకంజాతి దరీసు వుంటుంది. ఈ గమ్ షెడ్‌పూరులో అలాకాదు. వేషం తన శరీరానికి ఎలా అనుకూలంగా వుంటే అలా వేసుకొనడమే విధాయకం అన్నట్లు వేసేస్తారు. లావుపాటి మహాలంబోదరుడు గూడకట్టు కట్టి, ఆ గూడకట్టు దిగజారిపోకుండా తన మొలకు అమరే పటకా బజారులో ఎక్కడా లేకపోతే, ఆడాళ్ళెట్టుకునే బ్రూచ్‌సూది, అటేవాళ్ళు పోకముడి వేసికొనే ఆ ప్రాంతాన్ని తన మొల గుడ్డకు గ్రుచ్చుకొని, అదియింకా దిగజారిపోతూందేమోనని మొలకట్టుకు లగాంగా పంట్లాం తాళ్ళలాంటివి, బోరను బుజాన్నీ వీపునా కనబడేటట్టు ముందునుంచి వెనక్కు కరిపించుకొని, అంతే—ఆలాగే—పయిమీద కండువా అన్నా లేకుండా నడిచిపోతూవుంటాడు. ఎంత అవకతవక అడ్డదిడ్డపు విదేశీ ఫాషన్ మిఠావులన్నా మగాళ్ళు వేస్తారుగాని, పాపం ఆడ వాళ్ళు అదేంచేతనోగాని చీర జాకెట్టు ఇత్యాదుల్ని మానరు. కాని వాళ్ళు, మాటల్లోను, ఆటల్లోను, పాటల్లోను, అంత పట్టశక్యంగాని ముందంజే వేశేరు. నేలమీదే బిలియర్డ్సు ఆడేస్తూ వుంటారు ఆ గమ్‌షెడ్‌పూరులో

యువతీమణులు. చేత్తో ఫుట్‌బాల్, ముక్కుతో కారెమ్సు ఆడేస్తారు. ఎంచేతా అంటే ఆ పట్నంయొక్క ముఖ్యలక్షణాల్లో ముఖ్యలక్షణం ఇది. ఏ ఆటన్నా సరే దానికో దేశకాలపాత్ర విధివిధానాలేమిటి, ఏలాపడితే ఆలా ఆడవచ్చునని, ఏ వేషమన్నాసరే దానికో జాతి నీతి హేతువాద విలాస ధీధితి యేమిటి, ఏలాపడితే ఆలా ఎందుకు వెయ్యకూడదు? అని.

"గమ్‌షెడ్‌పూర్"కు అరవై ఆరు మైళ్ళల్లో "నిమ్మనీడ తరంగం" అనే ఒక సముద్రతీర విశాల పురముంది. సిఙ్లకంటె చల్లగావుండే ఆమ్లవృక్షాల్ని కొట్టివేసి, ఆ పట్నం అంతా నిమ్మచెట్లు పాతించి, మఱింత చలవగావించి, ఆ నిమ్మచెట్ల మొదళ్ళకు సముద్రపు కెరటాలు తగిలేటట్లు చేయడంవల్ల దాని కా పేరు వచ్చింది, అంటారు. "నిమ్మకు నీరోసినట్టు" అనే సామెత అక్కడే అన్నట్టు, సముద్ర కెరటంకూడా అణగి మణగి ఆ చెట్ల మొదట నిశ్శబ్దంగావుండి మనశ్శాంతి కలగజేస్తుంది. అలా ప్రకృతినన్నా నిశ్శబ్దం గావించేవారు గాని, నిమ్మనీడ తరంగపు ప్రజలు, తమ పట్నంప్రక్కనుంచి పోతూవుండే రైళ్ళరొద ఆపుకోలేక పోయినారు. అందులోకీ గమ్‌షెడ్‌పూరు, నిమ్మనీడతరంగము, ఈ రెండువూళ్ళూ మెయిన్ లైనుమీద వుండి, ఒక దానినుండి ఒకదానికి కోచెస్సు, షట్లుల్సు, అడుగడుక్కు నడుస్తూ వుంటాయేమో మఱీ అసహ్యాపు ధ్వని.

నిమ్మనీడతరంగం అన్ననగరంలో రంగనాథం అనే ఒక గొప్ప టెన్నిసు ఆటగాడు వున్నాడు. అతణ్ణి గమ్‌షెడ్‌పూరులో ఆడవాళ్ళంతా "స్వీట్ రంగనాథం" అనికూడా పిలుస్తారు. ఎంచేతా అంటే ఆ వూళ్లో ఆడవాళ్ళకు టెన్నీసు అంటే బహూప్రీతి మహాప్రీతి. ఆ పిలిచేటప్పుడు వాళ్ళహృదయాలకు వాళ్ళచేతుల్లోని జాటీగళ్ళు హత్తుకొని మఱీ పిలుస్తూ

వుంటారు. తఱచు చాలామంది ఇతగాణ్ణి పార్టనర్‌గా చేసుకొని పెద్ద పెద్ద తుదిగిన్నెలు కొట్టేఅవకాశా లుండడంచేత "స్వీట్ రంగనాథం" అనే పిలుపు మఱీ పరిపాటి అయిపోయింది.

నిమ్మనీడతరంగంలో అసలు టెన్నిసుకోర్టేలేదు. అక్కడందఱూ మగవాళ్ళు ఆ చెట్లనీడపట్టున సాచుకూర్చుని అన్నిరకాల అల్లటి చిల్లఱ పొల్లుకబుర్లూ చెప్పుకుంటూ వుంటారు. ఆడవాళ్ళు అరుగులమీదా అక్కడా కూర్చుని అయిపోయిన అపుపోసనాలనుగురించి, కాబోయేవాటిని గురించి, కొత్తగా ఊళ్లోకి వచ్చిన సారెలనుగురించి, లొడలొడగా అనుకొంటూ వుంటారు.

మన రంగనాథం నిమ్మనీడతరంగమువాడైనా, ఈ కబుర్లూ కాలక్షేపాలు కాకుండా టెన్నీసుఆట ఆతగాడికి ఏలా అబ్బింది అంటే అది అది సమస్యే! దానికి చెప్పేది వేఱే ఏమీలేదు. అతను అసలు గమ్‌షెడ్‌పూరువాడు అయియుండి నిమ్మనీడతరంగాని కిల్లఱికపు టల్లుడుగావచ్చి భార్యానుమట్టుకు ఇక్కడ తనకు ఇంట్లో పార్టనర్‌గా వుంచుకొన్నవాడై, మఱి తక్కిన అన్ని యితర వ్యవహారాలకు గమ్‌షెడ్‌పూరులో ఆడవాళ్ళనే తనకు పార్టనర్సుగా చేసికొని కాలంబుచ్చుతూండేవాడు. అతనికి గమ్‌షెడ్‌పూరులో ఒక ఫాన్సీషాపు వుంది. దానిలో తనకో స్త్రీరత్నం పార్టనర్. అతని ప్రతిపాదనం మఱేమీలేదు. వేఱే వేఱే ప్రతిదానికీ మిక్సెడ్, మిక్సెడ్ అని వివరించడమెందుకు? ప్రపంచమంతా మిక్సెడ్, రోడ్లన్నీ మిక్సెడ్ దానికో పెద్ద ఆశ్చర్యం పోనవసరము లేదని అతని ప్రతిపాదనం.

రంగనాథం భార్యపేరు కురంగినయన. ఆవిడ నిమ్మనీడతరంగంలో పుట్టిపెరిగిన ఆడపిల్లల్లో అతి సుకుమారిన్నీ, సునిసితపు బుద్ధిగలదిన్నీ

భర్తనేమీ కొంచి ప్రశ్నించకుండా వెయ్యికళ్ళా కాపాడుకుంటున్నానని ఆమె యిది.

రంగనాథం ఉదయం పదిగంటలకు మెయిలుకు యిటే తన రాకెట్టుచ్చుకు భార్యతో చెప్పకుండా వెళ్లిపోయినాడు.

కాని ఆక్రితం రోజున వూరూరా పత్రికల్లోను కరపత్రాల మూలంగానూ ఫలానిరోజున ఫలాని ఫలానివారికి సాయంకాలము మిక్సెడ్ డబుల్సు అని బ్రహ్మండంగా పంచిపెట్టివేశారు, ఫలాని గమ్‌షెడ్‌పూరులో ఫలానిచోటని; ఆ కరపత్రాలు ఊరూర మూల మూలలకు వెళ్ళిపోయి, కురంగినయన చేతిలో ఎగిరిపడ్డట్టు ఒకటి వచ్చిపడింది. ఆవిడ చేతిలోకి ఆలాంటి కాగితం రావడం అదే మొదటిసారి, అసలే ఆవలిస్తే పేగులు లెక్కట్టే మనిషి కాబట్టి మగడు అల్లా రాకట్టుచ్చుకు వెళ్ళినవెంటనే తాను రైల్వేగైడుతీసి చూచి 12 గంటలకో మిక్సెడ్డు ట్రయిను మధ్యాహ్నం నిమ్మనీడతరంగం నించి గమ్‌షెడ్డుపూరు పోయేది ఉండడం తెలుసుకుంది. వెంటనే తాను ఆ మిక్సెడ్డు ట్రయినుకు టిక్కెట్టు కొనుక్కొని గమ్‌షెడ్‌పూరు సరిగా నాలుగ్గంటలకు సాయంత్రం వెళ్ళింది.

అక్కడ కురంగినయన ప్రేక్షకుల్లో కూర్చుని చూస్తూ వుంది. పచ్చజండా ఒకటి తన భర్త తనభర్త పార్టనర్ స్త్రీ ఆడుతూ వున్నవైపు గాలికాడుతూ ఉంది. రెండోవైపు ఏ జండా లేదు. చివరకంటా చాలా బాగా ఆడి తన భర్త జట్టు నెగ్గడం హర్షపులకిత నేత్రాలతో కురంగినయన చూచి తాను కూడా అందరితో పాటు కరతాళధ్వనులు గావించింది.

రంగనాథం ఆట అయి ఓడిపోయిన ఎదరజట్టులోని మగవానితోను స్త్రీతోను కరస్పర్శాదులు చేసిన పిమ్మట ప్రేక్షకులకేసి రావడంలో కనుక్కొన్నాడు తనభార్యా కురంగినయనను.

అప్పుడు దంపతులిద్దరకీ ఇలా సంభాషణ జరిగింది.

రంగనాథం :– నీ విక్కడకు ఎందుకు వచ్చావు ?

కురంగినయన :– మీ మిక్సైడ్డు డబుల్సు చూడ్డానికి.

రంగనాథం :– ఏలా వచ్చావు ?

కురంగినయన :– 12 గంటల మిక్సెడ్డు ట్రయినుమీద.

రంగనాథం :- ఏలా వుందంటావు మా ఆట ?

కురంగినయన :– ఓ ! ఫుల్ ఆఫ్ మిక్సెడ్ ఫీలింగ్సు !

రంగనాథం :– (పెద్ద నవ్వు నవ్వి) you mean your feelings in seeing (చూడ్డంలో నీ అనుభవమున్ను) my feelings in playing (ఆడ్డంలో నా అనుభవమున్నూ) నా ?

అంతట్లోకి నిమ్మనీడ తరంగానికిపోయే బండికి సిగ్నల్ వాలింది.

——

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
| --- | --- | --- |
| 2—3—1935 | రాజమండ్రి | "వినోదిని"లో |